
# స్నేహం

## ఓల్గా

ఒక్కొక్క సామానూ ఇంట్లోంచి లారీలోకి ఎక్కుతుంటే ఇల్లు ఖాళీ అయిపోతోంది. ఇల్లు శూన్యంతో నిండుతున్న కొద్దీ జయ మనసులో బరువు పెరుగుతూంది.

ఇల్లు ఖాళీ చేయటం ఎంత తేలిక — మనసు ఖాళీ చేయటం ఎంత అసాధ్యం ! మనసులో ఉన్న స్నేహాన్ని తీసి అవతల



పారేయటమంటే ఇంట్లో పనికిరాని చెత్తను బైట పారెయ్యటమా? మోహనరావుకి అట్లాగే ఉంది.

ఎంత నిశ్చింతగా, చురుగ్గా సామాన్లు లారీలోకి ఎక్కిస్తున్నాడో!

చక్రవర్తి కోసం అతని మనసు ఒక్క క్షణమైనా బాధపడటంలేదా?

కానీ మాలతి కోసం తన ప్రాణం కొట్టుకుపోతోందే — మాలతి స్నేహం దూరమైపోతుందనుకుంటే తనకు కాళ్లు వణికిపోతున్నాయే —

జయ మనసు చుట్టూ పరుచుకుని ఉన్న సామానులన్నిటినీ దాటుకుంటూ స్నేహం చుట్టూ తిరుగుతోంది. స్నేహం — ఈ పదం — ఈ భావం — దాని చుట్టూ అల్లుకున్న భావజాలం వీటి కెంత శక్తి ఉంది — స్నేహితులు కలిగించినంత ఆనందాన్నీ, వాళ్లు కలిగించినంత బాధనూ మరే బాంధవ్యంలో ఉన్నవాళ్లూ కలిగించరేమో — చిత్ర మేమిటంటే ఏ సంబంధంలోనైనా అంతో ఇంతో స్నేహం కలిస్తేనే గాని అది నిజంగా మనల్ని ఆనందపెట్టలేదు.

అన్ని బాంధవ్యాలలోనూ అల్లుకుపోవాలని చూసే ఈ స్నేహానికి అడుగడుగునా ఆటంకాలే గదూ —

అన్ని ఆటంకాలనూ ఎదుర్కొని కడదాకా స్నేహ దీపాన్ని వెలిగించటం ఎందరికి సాధ్యమవుతుంది?

ఎందరు స్నేహితులు మిగులుతారు చివరికి?

ఎవరైనా స్నేహాన్నీ — స్నేహమనే భావాన్నీ ప్రేమించినంతగా స్నేహితులను ప్రేమిస్తారా?

మనం భావనలను ప్రేమించినంతగా భౌతిక వాస్తవాలను ప్రేమించమేమో !

ఎందుకని? భావన అనేక మంది మనుషుల అనుభవాల సారం నుండి తయారవుతుంది. చరిత్ర రూపంలో, సాహిత్య రూపంలో తిరిగి మనుషులకు అందుతుంది. ఆ భావన ఎంతగా ఒంటబడితే మనుషులు అంతగా విశ్వాసాన్ని పెంచుకుంటారు. కానీ స్నేహితులు నిత్య జీవితంలో అనేక ఘర్షణల మధ్యా, ఉద్రిక్తతల మధ్యా స్నేహాన్ని కాపాడుకోవాలంటే కత్తి మీద సాము చేయాలి. అలా చేసిన వారు మళ్లీ చరిత్రలోనో, సాహిత్యంలోనో మిగిలిపోతారు. మళ్లీ స్నేహం విలువనూ, బరువునూ లోతునూ పెంచుతారు. జీవితమంతా స్నేహం కోసం ఆరాటపడిన తను స్నేహితురాలుగా తన పాత్ర నెంతవరకు సరిగా నిర్వహించింది? ఎందరిని బాధ పెట్టింది?

ఒక్కసారి ఆ స్నేహపు జ్ఞాపకాల అలలతో తన పాదాలను తడుపుకోవాలనీ, కాళ్ల కింద నేల కదిలిపోతుందో లేదో చూసుకోవాలనీ బలంగా అనిపించింది జయకు.

కాళ్ల కింద నేల కదిలిపోతుందనే విషయంలో జయకేమీ సందేహం లేదు. కానీ కదిలేచ్చే ఆ శక్తులకు అంత బలమేమిటి? ఎక్కడి నుంచి వచ్చిందా బలం? దాన్ని ఎదుర్కోవటం ఎట్లా ఇది తెలియదు జయకు.

అసలు తను ఎవరితోనైనా స్వేచ్ఛగా స్నేహం చేయగలిగిందా?

లేదు — అది జయకు చాలా స్పష్టంగానే

తెలుసు. స్వేచ్ఛకూ, స్నేహానికీ ఉన్న సంబంధం ఎంత దగ్గరిది ! స్వేచ్ఛ లేనిదే స్నేహం లేదు. స్నేహం లేనిదే స్వేచ్ఛకు అర్థం లేదు. మనుషుల మధ్య మరింత స్నేహ పూరిత వాతావరణం' సృష్టించటానికే గదూ స్వేచ్ఛ!

తనకు స్వేచ్ఛ లేదు. అందుకే స్నేహితుల్ని మధ్యలో ఒదిలేసి వెళ్లిపోతుంది.

మరియమ్మను ఒదిలేసింది. సుగుణను ఒది లేసింది. సరితను ఒదిలేసింది — ఇప్పుడు మాలతిని....

ఊహ తెలిసినప్పటి నుంచీ తన స్నేహాలకు ఎప్పుడూ ఆంక్షలే.

ఎట్లా సహించింది — ఎందుకు సహిస్తోంది?

నిజానికి చాలా రోజులు అది తన స్నేహ జీవితం మీద తనవాళ్లు పెట్టిన నిర్బంధం అని జయకు తెలియదు. మరియమ్మ విషయంలో అసలు తెలియదు.

జయ ఆరో తరగతిలోనే బళ్లో చేరింది. అప్పటి వరకూ ఇంట్లోనే చదివింది. ఒక టీచరు గారొచ్చి చెప్పేవాళ్లు. ఆరో తరగతిలో చేరి బెరుగ్గా స్కూల్లోకి వచ్చిన జయను నవ్వుతూ ఎదురొచ్చి క్లాసులోకి తీసుకెళ్లింది మరి యమ్మ. క్లాసులో అప్పటికే తనకున్న స్నేహి తుల్ని జయకు పరిచయం చేసింది. జయ పది రోజులు ఆలస్యంగా చేరటం వల్ల బెంచీలన్నీ నిండిపోయాయి. చివరి వరసలో మూడు బెంచీలు మాత్రం ఖాళీగా ఉన్నాయి. ఒకో బెంచీ మీద ముగ్గురు కూచోవచ్చు. కానీ జయ ఒక్కత్తే — ఆ పిల్లకు ఏడుపొచ్చింది. ఆ వెనక బెంచీలోకి కొత్తగా వచ్చిన పిల్ల కోసం ఎవరొ స్తారు? ఎవరూ అందుకు సిద్ధపడలేదు. గుడ్ల నీళ్లు గుడ్ల కక్కుకుంటూ వెనక్కి నడిచింది. కాసేపు అట్లాగే నుంచుంది. చివరి కిక చేసేది లేక బెంచీ మీద కూచుని తలవంచుకుని పుస్త కాలు డెస్కులో సర్దుకుంటుండగా జయ భుజం మీద ఎవరిదో చేయి పడింది. చల్లగా, మంచు ముద్దలా ముడుచుకుపోయిన జయ గుండెల్లోకి వెచ్చదనాన్ని పంపింది. జయ తల ఎత్తి పక్కకు చూస్తే మరియమ్మ.

ఆ కళ్లల్లో ఎట్లాంటి నవ్వు! అంత దయగల, ప్రేమ గల నవ్వు మళ్లీ జయ ఎన్నడూ చూడ లేదు.

మరియమ్మ జయ కోసం వెనక బెంచీలోకి వచ్చింది. మొదటి బెంచీలో మొదట కూచునే మరియమ్మ.

జయ, మరియమ్మ ఎన్ని కబుర్లో చెప్పుకునే వాళ్లు. మరియమ్మ నవ్వంటే జయ కెంతో ఇష్టం. ఆ పిల్ల ఎంత బాగా నవ్వేదో అంత బాగా పాడేది. ఏసుప్రభువు మీద ఎన్ని పాటలు వచ్చో మరియమ్మకు. హల్లెలూయా — హల్లె లూయా అన్న పదం మరియమ్మ పెదవుల గుండా ఎంత మధురంగా వచ్చేదో ! మరి యమ్మ జయకంటే రెండేళ్లు పెద్దది. జయ కంటే చాలా పేదది. ఆ సంగతి మొదటిసారి మరియమ్మ ఇంటికి వెళ్లినప్పుడు జయకు తెలి సింది

ఇంటిముందున్న కాస్త చోటులో కనకాంబరాలు తెగ పూశాయి. బంతిమొగ్గ తొడిగి ఉంది. మరియమ్మ తల్లి పొగాకు కంపెనీలో గ్రేడింగ్ పనికి వెళ్తుంది. వాళ్ల నాన్న ముఠా పనికెళ్తారు. మరియమ్మంటే వాళ్ల కెంత ఇష్టమో వాళ్లతో గడిపిన ఐదు నిముషాల్లోనే జయకు తెలిసిపోయింది. ఇద్దరికీ ఇన్ని శనగపప్పు, ఇంత బెల్లం ముక్కా పెట్టింది మరియమ్మ తల్లి.

ఆ రోజు సాయంత్రం మరియమ్మతో కబుర్లు చాలించి ఇంటికి వెళ్లేసరికి ఆలస్యం అవనే అయింది.

ఇంటి దగ్గర అమ్మా, నాయినమ్మా ఎదురు చూస్తున్నారు. జయ మరియమ్మ సంగతి చెప్పగానే వాళ్లమ్మ ముఖం చిట్లించి —

"ఎందుకు అడ్డమైన వాళ్ల కొంపలన్నీ తిరు గుతావు? బడి వదలాగానే రాలేవూ?" అంటూ జయను స్నానాల గదిలోకి నెట్టింది.

ఆ రాత్రి నాయనమ్మ జయను పక్కలో పడుకోబెట్టుకుని తక్కువ కులాల వాళ్లతో స్నేహం చేయకూడదనీ, బళ్లోనైనా వాళ్లకు కాస్త దూరంగానే ఉండాలనీ, వాళ్ల ఇళ్ళ కసలు వెళ్లకూడదనీ మెల్లిగానే అయినా గట్టిగానే చెప్పింది.

జయకు ఆ మాటలు అర్థం అయ్యాయి — కాలేదు. కానీ ఏడుపొచ్చింది. ఈ మాటలన్నీ మరియమ్మకు తెలిస్తే — మరియమ్మ వింటే —

మరియమ్మ మీద జాలితో, స్నేహంతో జయ చిన్న గుండె నిండిపోయింది.

ఇంతలో ఘరో పెద్ద సందేహం.

మరియమ్మను తన ఇంటికి తీసుకురాకూ డదా? ఆ పిల్ల వస్తానంటే ఏం చెయ్యాలి? ఒద్ద నాలా? ఛీ — జయ మనసు భయంతో మాట్లా డలేకపోయింది. పది రోజులు గడిస్తేగాని జయలో బెరుకూ, గిల్టీ ఫీలింగూ తగ్గలేదు.



ఇంతలో ఓ రోజు హఠాత్తుగా మరియమ్మ బడికి రాలేదు. ఒంట్లో బాగోలేదేమో అనుకుంది జయ.

కానీ వరసగా నాలుగు రోజులు రాలేదు మరియమ్మ. ఐదో రోజు క్లాసు పిల్లలకు అసలు విషయం తెలిసింది. మరియమ్మ పెద్దమనిషయిందట. అట్లా అవటం అంటే ఏమిటో జయకు కొంత తెలుసు. రెండేళ్ల క్రితం జయ అక్క పెద్ద మనిషయింది. హడావుడంతా జరిగింది. మరియమ్మ పెద్ద మనిషయిందనేసరికి జయకు నవ్వొచ్చింది. సంతోషం కూడా కలిగింది. వెంటనే వెళ్లి మరియమ్మను చూడాలనిపించింది. జయతో బాటు మరో ఐదారుగురు కూడా బయల్దేరారు.

మరియమ్మ వీళ్లను చూసి సిగ్గుపడుతూ నవ్వింది. కానీ ఏం మాట్లాడలా. తల వంచుకుని కూచుంది. నేల మీద తాటాకులు పరిచి దాని మీద వరిగడ్డి వేసి దాని మీద పాత దుప్పటి పరిచి ఓ మూలగా కూచోబెట్టారు మరియమ్మను. అందరూ మరియమ్మను కాసేపు కుతూహలంగా చూసి ఇళ్ళకు వెళ్లిపోయారు.

ఐతే ఆ రోజు ఆలస్యానికి కారణం మరియమ్మ ఇంటి కెళ్లటం కాదు, సుగుణ వాళ్లింటికి వెళ్లటం. అట్లా అని ఇంట్లో అబద్ధం చెప్పింది జయ.

అందువల్ల ఇంట్లో రాద్ధాంతమేమీ జరగలేదు. మరో పది రోజులకు క్లాసులలో పిల్లలకు ఎలా వచ్చిందోగాని ఓ పిలుపు వచ్చింది. మరియమ్మ స్నానం చేసి ఇంట్లో కొచ్చే రోజు భోజనాలు పెడతారట. ఆరో క్లాసు పిల్లల్ని రమ్మని చెప్పి పంపారట.

భోజనాల సంగతి జయకు కూడా తెలిసింది. మరియమ్మ ఇంటికి భోజనానికి వెళ్లాలా? వెళ్లాలనే జయ మనసు పీకింది. కానీ ఆ రోజు స్కూలుంది. ఎట్లా వెళ్లటం. కానీ స్కూలుంటేనే వెళ్లటం సులువని మల్లీశ్వరి చెప్పింది.

మధ్యాహ్నం అన్నాల బెల్లు కొట్టినప్పుడు టిఫిను కారియర్లలో అన్నం తినకుండా మరియమ్మ వాళ్లింటికి వెళ్లి అక్కడ తింటారు. ఇక మరి బడికి రాకుండా అక్కడే కాసేపు ఆడుకుని ఏకంగా ఇంటికెళ్తారు. ఎవరెరొస్తారని లెక్కలు వేస్తే ఆరుగురూ తేలారు. "పోనీ టీచర్‌గారితో చెప్పి వెళ్దాం" అంది సుందరి. ఆరుగురూ వెళ్లి థెరిసా టీచరుగారి అనుమతి అడిగారు. ఆమె వెళ్లమంది.

జయా మిగిలిన అమ్మాయిలూ ఒక్క పరుగు తీశారు. అక్కడ మరియమ్మ ఇంటి ముందు చిన్న పందిరి వేశారు. చాలా మంది జనం వచ్చారు. ఈ పిల్లల్ని చూడగానే మరియమ్మ వాళ్లమ్మ వాళ్లను దగ్గరకు పిల్చి పంపింది. మరియమ్మ కొత్త బట్టల్లో మెరిసిపోతోంది. అందరూ కలిసి అన్నాలు తిన్నారు. ఆ రోజు తిన్న లడ్ల రుచి ఇంకా జయకు గుర్తుంది.

కానీ ఆ రోజు తను తిన్న దెబ్బల రుచి కూడా జయకు బాగా గుర్తుంది.

"మాల కూడు తిని వస్తావా" అంటూ నాన్న జయ వీపు మీద బాదేశాడు. మరియమ్మతో స్నేహం మానేస్తానని ఒట్టేసే దాకా నాయనమ్మ ఒదల్లేదు.

మర్నాడు బళ్లో మరియమ్మను చూసి జయ ఎంతో ముడుచుకుపోయింది.

మరియమ్మ తన పక్క కొచ్చి కూచుని నవ్వుతూ మాట్లాడబోయేసరికి జయ పుస్తకాలు సర్దుకుని పక్కనున్న ఖాళీ బెంచీలోకి వెళ్లి కూచుంది. మరియమ్మ అయోమయంగా తన వంక చూసిన చూపు జయ ఎన్నటికీ మర్చిపోలేదు.

మరియమ్మతో స్నేహం అలా ఆగిపోయింది. కొత్త స్నేహితురాలు కావాలిగా !

సుగుణ — సుగుణదీ, జయదీ ఒకటే కులం. ఆ ఏడాది పరీక్షల కింకా మూడు నెల్లే టైముంది. ఆ మూడు నెలలూ ఇద్దరూ కలిసి చదివారు. ఎండాకాలం శలవలన్నీ కలిసి ఆడుకుంటూ గడిపేశారు. బోలెడు పుస్తకాలు కూడా చదివారు. సుగుణే తనకు నవలలు చదవటం నేర్పింది.

కానీ ఎండాకాలం శలవలయ్యాక సుగుణ మరి బళ్లోకి రాలేదు. శలవల చివర్లో సుగుణ పెద్ద మనిషయింది. వాళింట్లో వాళ్లంతా కలిసి సుగుణ చదువు ఆపేయించాలని తీర్మానించారు. పెళ్లిసంబంధాలు కూడా చూడటం మొదలుపెట్టారు. తనూ సుగుణా వాళ్లింటి డాబా మీద కూచుని ఎంత ఏడ్చారో.

"పెద్ద మనిషయితే చదువెందుకే ఆపటం?" అని తను అడిగితే పాపం సుగుణ మాత్రం ఏం చెబుతుంది. సుగుణ స్నేహం మరుపుకు రావటానికి చాలా రోజులే పట్టింది. ఇంకెవరితోనూ స్నేహం చేయాలనిపించలేదు చాలా రోజులు.

తన చదువు కూడా ఆపేస్తారా పెద్దమనిషయితే అన్న ఆందోళనతో ఎవరితోనూ స్నేహం చేయలేకపోయింది.

చివరికి తనను చదివించాలనే నిర్ణయించుకున్నారు. తొమ్మిదో తరగతిలో ఉండగా ఇక ఆ ఆందోళన పోయాక సరితతో స్నేహం కుదిరింది. సరితదీ, తనదీ ఒక కులం కాదుగానీ సమాన స్థాయిలో ఉండే కులాలే —

అందువల్ల ఇంట్లె వాళ్ల కళ్లు తమ మీద పడలేదు. హాయిగా ఆనందంగా స్నేహం చేశారు. కాలేజీలో కూడా ఇద్దరూ ఒక గ్రూపే తీసుకున్నారు.

ఎంత బాగుండేవి ఆ రోజులు. బి.ఎ. మొదటి సంవత్సరం ! ఆ యవ్వనోత్సాహం. ఈ ప్రపంచమంతా తమ కోసమే అన్నంత ధీమా. ఆ నవ్వులకు అంతం ఉండేదా? ఒకర్ని చూసుకోగానే ఒకరికి ఎందుకంత ఆనందం కలిగేదో తెలిసేదా? భుజాల మీద చేతులు వేసుకునో, చేతులు పట్టుకునో ఆ కాలేజీ చెట్ల కిందుగా నడుస్తుంటే ఇక మరే విషయమూ పట్టేది కాదు !

కానీ రెండో సంవత్సరంలో సరిత ప్రేమలో పడింది.



## బాలీవుడ్ బాణీ
## పూజకు మరో ప్రేమపక్షి!

ప్రేమికులనే చక్రాలను ఎప్పటికప్పుడు మార్చడం మహేశ్‌భట్ గారాల కూతురు పూజాభట్‌కు ఐస్‌క్రీమ్‌తో పెట్టిన విద్య కదా! కమల్ సాద్నా నుంచి మొదలుపెడితే సన్నీ డియోల్ వరకు పూజ ప్రేమ జ్వాలల్లో మాడి మసైపోయినవారు చాలామందే ఉన్నారు. తాజాగా సల్మాన్ ఖాన్ సోదరుడు సోహిల్ ఖాన్‌తో పూజ చెట్ట పట్టాలు వేసుకుని చెట్టూ పుట్టా పట్టుకు తిరుగుతున్నట్లు కబురు ... సోహిల్ తండ్రి సలీంఖాన్ నిర్మించిన జిమ్‌లో గంటల తరబడి ఇద్దరూ వ్యాయామాలు చేస్తున్నారట ...!

మసూద్ అన్సారి

## బాలీవుడ్ బాణీ

**● అయోమయంలో రవీనా**



అక్షయ్‌కుమార్‌తో ప్రేమ పెళ్లి వరకు రావడంతో ఆ ఆనందంలో మునిగి 'మస్త్ మస్త్' గర్ల్ రవీనా అయోమయంలో పడింది. అక్షయ్‌తో పెళ్లి ఖాయమవడంతో చిత్రాల సంఖ్య తగ్గించుకుంటున్నట్లు ప్రకటించిన రవీనా, ఇప్పుడు మళ్లీ ఆలోచనలో పడి తిరస్కరించిన చిత్రాల్లో నటించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. పెళ్లికి కాస్త సమయముంది కనుక ఊరికే కూర్చోవడం ఎందుకని ఇప్పుడాలోచిస్తున్నదట! రవీనా అయోమయం వల్ల నిర్మాతలు, దర్శకులు పాట్లు పడుతున్నారు. ఈ ఏడాది చివరిలోగా రవీనా పెళ్లి ఖాయమనే మాట కూడా వినిపిస్తోంది. మరి అవన్నీ పూర్తి చేస్తుందా? లేక వారి కొంపలు ముంచి ..?

మసూద్ అన్సారి

"వినుము చెలీ తెలిపెదను పరమ రహస్యం, అది మరి ఎవరూ ఎరుగరాని మధుర రహస్యం" అంటూ ఆ ప్రేమ విషయం తనతో చెప్పింది. తనకు బాధపడాలో సంతోషించాలో అర్థం కాలేదు. సరిత తనకు దూరమవుతుందా? ఎవరీ కృష్ణ?

కృష్ణతో పరిచయం చేసింది సరిత. కృష్ణ మంచివాడే అనిపించింది. రోజూ కాలేజీ వదిలే వేళకు వచ్చేవాడు — కాసేపు ముగ్గురూ కబుర్లు చెప్పుకున్నాక వాళ్లిద్దరూ కలిసి వెళ్లేవాళ్లు. మర్నాడు సరిత ఇచ్చే వాళ్ల ప్రోగ్రెస్ రిపోర్టు కోసం రాత్రి ఎప్పుడు గడుస్తుందా అని ఆత్రుత పడేది తను.

రాను రానూ సరితా కృష్ణల ప్రేమ పెరిగింది. వాళ్లిద్దరూ సినిమాలూ షికార్లు మొదలు పెట్టారు. అప్పుడప్పుడూ జయా వాళ్లతో వెళ్తోంది. ఓ రోజు రాత్రి అన్నం తిని చదువుకోటానికి పుస్తకాలు తీస్తుండగా —

అన్నయ్య "జయా! జయా! జయేదీ" అని గావుకేకలు పెడుతూ వచ్చాడు.

జయ హాల్లోకి వెళ్లింది.

"నువ్వా సరితతో స్నేహం మానెయ్యి." అన్నాడు తన ఆజ్ఞ మీదే సర్వ ప్రపంచం నడుస్తున్నట్లు. ఇంట్లో అందరూ ఆసరికి హాల్లో చేరనే చేరారు. "అమ్మా! దీని స్నేహితురాలు సరిత లేదూ? అది మంచిది కాదే. ఎవడితోనో కలిసి తిరుగుతోంది. నాలుగైదుసార్లు చూశాను గానీ — ఎవరో బంధువేమో అనుకున్నా. ఇవాళ పార్కులో వాళ్లిద్దరూ చేరి ముద్దులూ, కావలింతలూ అన్నీ అక్కడే. జయా! రేపట్నించి నువ్వా సరితతో కనిపించావో చంపేస్తా."

"నీకొక్క మంచి స్నేహితురాలు దొరకదేమిటే" అమ్మ గొంతు దుఃఖంతో బొంగురుపోయింది.

"వాళ్లిద్దరూ పెళ్లి చేసుకుంటారు" తన్నుకొస్తున్న దుఃఖాన్ని కంట్రోలు చేసుకుంటూ అంది జయ.

"వాళ్ల బొంద చేసుకుంటారు. వాళ్ల వ్యవహారం చూస్తుంటే ఒట్టి కక్కుర్తి మనుషుల్లా ఉన్నారు. పెళ్లి చేసుకుంటే అప్పుడు వెళ్లి విందులు కుడుద్దువుగానిలే. ఇప్పుడు మాత్రం దాని స్నేహం మానెయ్ — దాన్ని మనింటికి తీసుకురాకు. నువ్వు దానింటికి వెళ్లకు."

జయకు తన జీవితంలో ఎన్నడూ రానంత కోపం వచ్చింది.

"నా స్నేహితురాలితో నేను స్నేహం మానేస్తానో- లేదో అది తర్వాత సంగతి. నువ్వు మాత్రం ఇంకొక్కసారి నా ఫ్రెండ్‌ని అదీ ఇదీ అన్నావో మర్యాద దక్కదు." జయ వెళ్లి తన మంచం మీద పడుకుని రాత్రంతా ఏడుస్తూనే ఉంది.

మర్నాడు తన చదువు ఆపెయ్యమని అన్నయ్య చాలా రభసే చేశాడు. "ఇంకొక్క ఏడాదేగా, కాస్త కట్టడి చేద్దాంలే" అన్నాడు నాన్న.

"రెండేళ్లుడబ్బు తగలేశాం. ఆఖరి నిముషంలో ఎందుకు ఆపటం" అంది అమ్మ.

ఈ మాటలన్నీ వింటూ అవమానరతో దహించుకుపోతూ ఉంది జయ. వీళ్లందరి దయాభిక్ష ఎందుకు కావాలి తన చదువుకు? తన చదువు — తన స్నేహం, తన జీవితం అన్నీ వాళ్ల నిర్ణయాల మీద ఆధారపడి ఎందుకుండాలి? తనేమిటి? తనేమిటి? తనేమిటి?"

సరితతో ఈ సంగతంతా చెప్పి ఏడ్చింది. ఇద్దరూ కాలేజీలో కలవటం తప్ప ఒకరిళ్లకు ఒకరు పోవటం లేదు.

ఆ సంవత్సరం పరీక్షలయ్యాయి. ఎండాకాలం అంతా ఒకర్నొకరు కలవకుండా ఎలా ఉండాలో అర్థంకాక కళ్లనీళ్లు పెట్టుకున్నారు. రెండు నెలలేగా అని ఓదార్చుకున్నారు. కానీ — ఆ తర్వాత సరిత మళ్లీ కనిపించలేదు.

మరో పది రోజుల్లో కాలేజీ తెరుస్తారనగా జయ పెద్దమ్మ కూతురి పెళ్లికి ఒక్క రోజు వైకుంఠపురం వెళ్లి వచ్చింది.

రాగానే అమ్మ ఏదో కొంప మునిగినట్లు చెప్పింది. "ఆ సరితను మనింటికి రావొద్దని చెప్పలేదేమిటీ? నిన్న పొద్దున్నే వచ్చి కూచుంది. అన్నయ్య చూసి చిల్లర మనుషులొచ్చే ఇల్లు కాదిది అని కేకలేసి పంపేశాడు. ఆడపిల్ల ఏడుస్తూ వెళ్లిన ఉసురు మన కెరిదుకురా అంటే వినకుండా కేకలేశాడు. ఆ పిల్ల వెళ్లిపోయింది."

జయకు కోపంతో కళ్లెర్రబడిపోయాయి. అన్నయ్యను తందామన్నంత కోపం వచ్చింది. సరిత దగ్గరకు వెంటనే వెళ్లాలనిపించింది. "ఏదో ఓ వంకతో వెళ్లిపోతాను. వీళ్ల మాటలకు విలువిచ్చే దేమిటి?" అనుకుని స్నానం చేసి తయారవుతోంది. ఇంతలో అన్నయ్య ఆనందంగా వచ్చి చెప్పాడు.

"మీ సరిత నిద్ర మాత్రలు మింగి చచ్చిపోయింది తెలుసా?"


ఆ మాటలు ఎట్లా మెదడులోకి ఎక్కాయో, ఎట్లా తట్టుకుందో తనకే తెలియదు.

సరిత ఎందుకు ఆత్మహత్య చేసుకుంది?

అంత అవసరం ఏమొచ్చింది? తనతో ఎందుకు చెప్పలేదు? అన్నీ తనతో చెప్పుకునే సరిత — చెప్పుకోటానికే తన ఇంటికి వచ్చింది. తను వచ్చే దాకా తన ఇంట్లో కూచునే వీలుంటే తనతో చెప్పేది. తను సరితను రక్షించగలిగేది. ఈ ఇంట్లో వాళ్లంతా హంతకులు. సరితను చంపేశారు.

అసలు సరిత ఎందుకు చనిపోయింది? కృష్ణ మోసం చేశాడా? వాళ్లింట్లో తెలిస్తే గొడవ చేశారా? ఏమయిందో తెలియని గందరగోళం. నాలుగు రోజులు పెద్ద జ్వరం. జ్వరం తగ్గుతుండగా తన క్లాస్‌మేట్స్ సువర్చల, సీత వచ్చి విషయమంతా చెప్పారు. కృష్ణ వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడట. వాళ్లింట్లో వాళ్లను ఎదిరించలేకపోయాడట. కృష్ణ పెళ్లి జరిగే సమయంలోనే సరిత చనిపోయిందట.

జయకు కృష్ణ మీద కంటే తన మీదా, తన ఇంట్లో వాళ్ల మీదా ఎక్కువ కోపం వచ్చింది.




సరిత ఎంత బాధపడిందో — ఎంత ఏడ్చిందో — ఒక్కమాట తనతో చెప్పాలని ఎంత అల్లాడిందో, అన్నయ్య మాటలతో అసలే కుంగిన ఆమె చావుని ఆశ్రయించిందేమో —

ఒక్క ధైర్యపు మాట సరితకు అంది ఉంటే బతికేదేమో. తన పిరికితనం సరిత చావుకి కారణమేమో? తనతో చెప్పుకోవాలని సరితకు ఎంత కోర్కె ఉండి ఉంటుందో ఊహించగలదు. అట్లా చెప్పుకోటానికి వీల్లేని స్నేహం చెయ్యలేదు. అసలు ఆడదానిగా పుట్టి స్నేహం కోసం ఆశపడకూడదు.

కులం, వయస్సు, నీతులు, ఇంట్లో వాళ్లూ అన్నీ ఆటంకాలే ఆడవాళ్ల స్నేహానికి — అన్నయ్య స్నేహితు లెవరో తనకు తెలుసా? ఎందుకు అన్నయ్య తన గురించీ, తన స్నేహితుల గురించీ పట్టించుకుంటాడు? నాన్న కెందరో స్నేహితులు. ఇతర కులాల వాళ్లూ వస్తారు. అమ్మ కసలు స్నేహితులు లేర్సు, బంధువులు తప్ప. అమ్మకు స్నేహం చేసే అవకాశం రాలేదు. తనకు స్నేహం అంటే తెలుసా? స్నేహం చేసే అర్హత ఉందా తనకు?

సరితా ! నీకు నాతో ఉన్నంత గాఢ స్నేహం మరింకెవరితోనన్నా ఉండి ఉంటే బతికేదానివా?

ఆ స్నేహితురాలు నాలా పిరికిది కాకుండా

నీ కష్టంలో నిన్నాదుకోగలిగేదా? సరితా — సరితా ఒక్కసారి కనిపించవా? ఒక్కమాట చెప్పవా? సరితా సరితా నిన్ను చూడాలి. ఎట్లా? ఎట్లాగమ్మా. వచ్చి ఒక్కసారి నా భుజం మీద చెయ్యి వెయ్యవూ. నా చెయ్యి పట్టుకుని కాలేజీకి రావూ? అని నా ఒళ్లో తల పెట్టుకుని మెరిసే కళ్లతో నీ ప్రేమ కబుర్లు చెప్పవూ.

సరితా — సరితా — నా మీద ఎంత కోపంతో వెళ్లిపోయావో గదా ఒక్క మాట చెప్పకుండా?

జయ సరిత జ్ఞాపకాల నుండి బైటపడి మళ్లీ కాలేజీకి వెళ్ళటానికీ, సరిత చావుకి కారణమని తను నమ్మిన తన వాళ్లతో సహజీవనం చెయ్యటానికీ చేసిన యుద్ధం ఎలాంటిదో, ఎంత భీకరమైందో, ఎన్ని గాయాలయ్యాయో, ఎంతెంత రక్తాలు కారాయో ఎవరికీ తెలియదు. అర్థం కాదు.

బి.ఏ. మూడో సంవత్సరంలో జయకూ పెళ్లి సంబంధాలు చూడసాగారు.

జయకు ఆ ఇంటి నుంచి వెళ్లిపోవాలనే ఉంది. కథల్లో, నవలల్లో జరిగినట్లు తనకు మంచి భర్త దొరికితే — ఆ భర్తతో తన జీవితం హాయిగా గడిచిపోతుందేమో. తన ఇల్లు తనకుంటే, తన స్నేహితుల్ని తన ఇంటికి రానివ్వగలిగిన స్థితి ఉంటుందేమో ! జయకు ఎన్నో ఆశలు.

కానీ అంతా తన అదృష్టం. ఆ వచ్చేవాడు ఎలాంటివాడో జయకు ఎంతో భయం. కానీ మోహనరావుని చూస్తే ఎంతో ఆశ కలిగింది. అతను నిజంగా మంచివాడు. పెళ్లి చూపుల్లోనే ఎంతో సరదాగా ప్రవర్తించాడు.

పెళ్లిలో తన ప్రాణ స్నేహితు డంటూ చక్రవర్తి అనే అతన్నీ, అతని భార్య మాలతినీ పరిచయం చేశాడు.

చక్రవర్తికీ కూడా ఆ క్రితం నెలలోనే పెళ్లయిందట.

ప్రాణ స్నేహం చెయ్యగల మోహనరావు తన భర్త కావటం అదృష్టం కాక మరేమిటి? చక్రవర్తీ, మోహనరావూ ఒకే ఆఫీసులో, ఒకే హోదా కలిగిన ఉద్యోగాలు చేస్తున్నారు.

"మేం ఒకటో క్లాసు నుండీ ఇప్పటివరకూ ఎన్నడూ విడిపోలేదు. ఉద్యోగాలు కూడా అలాగే వచ్చాయి. చక్రిని చూడకుండా ఒక్క రోజుండలేను" అంటున్న భర్త వంక ఎంత ఆరాధనగా చూసిందో తను!

తమ కోసం చక్రవర్తి వాళ్లింటికి దగ్గర్లోనే ఇల్లు చూసిపెట్టాడు.

తనను ఇష్టపడే భర్త. దేనికీ లోటులేని జీవితం. చక్రవర్తి దంపతుల స్నేహం. జయకు పాత గాయాలన్నీ మానాయి. ముఖ్యంగా మాలతి ఆమెలో జీవశక్తి నింపింది.

మాలతి ఎంత చురుకైనదో, తెలివైనదో, హుషారైనదో.

ఇద్దరూ కలిసి సినిమాలు, షికార్లు, షాపింగులు. ఇవి ఎవరితోనైనా చేయవచ్చు. కానీ చర్చలు — మాలతి ప్రతి విషయాన్నీ ఎంతో వివరంగా చర్చించేది. పేపర్లో రాజకీయాల దగ్గర నుండీ, పత్రికల్లో వచ్చే కథలు, సినిమాలు — అన్నీ విశ్లేషించి చెప్పేది. ఆమె చెబుతుంటే అట్లాగే వినబుద్ధయ్యేది. మాలతి పాట

ప్రతి వెన్నెల రాత్రీ నలుగురూ డాబా మీద చేరి మాలతి పాటలు వినేవాళ్లు — రాత్రీ వెన్నెలా అన్నీ ఆ పాటలో కరిగిపోయేవి. మాలతి స్నేహం మోహన్రావు మూలంగానే అనుకుంటే జయకు మోహన్రావు మీద ప్రేమ పెరిగిపోయేది.

"ఈ ముద్దు మాలతి లాంటి ఫ్రెండు నిచ్చినందుకు" అని గట్టిగా భర్తను ముద్దు పెట్టుకునేది.

ఆ రోజుల్లోనే జయ ఇంటి కెదురుగా పక్క పక్క వాటాల్లో ఉన్న రెండు కుటుంబాల్లో ఒక చిత్రం జరిగింది. ఆ కుటుంబాల్లో ఆడవాళ్లిద్దరికీ ఎందుకొచ్చిందోగాని తగువొచ్చింది. ఇద్దరూ భీకరంగా పోట్లాడుకున్నారు. బజారంతా వినపడేలా అరిచేసుకున్నారు. అది ఒక రోజుతో ఆగలేదు.

రెండు రోజులకోసారి ఆడవాళ్లిద్దరూ బజార్నపడేవారు.

"ఇద్దరూ ఇళ్లు మారొచ్చుగా! రోజూ ఎందుకీ చెర వాళ్లకు" అంది జయ విసుగొచ్చి.

"మగాళ్లిద్దరూ మాట్లాడుకుంటూనే ఉన్నారు ఆడవాళ్లకే వచ్చింది" అన్నాడు మోహన్రావు.

ఒక రోజు సాయంత్రం ఆ ఎదురింటాయన ఏదో పని మీద వస్తే మోహన్రావు చెప్పాడు. ఆ పేటలోనే మరో ఇల్లు ఖాళీగా ఉందనీ కావాలంటే మారొచ్చనీ.

"మేం ఇల్లు మారుతామని ఎందుకనుకున్నారు?" అన్నాడాయన ఆశ్చర్యపోతూ.

"రోజూ మీకు పక్కింటి వాళ్లకూ గొడవగా ఉంది గదా మారతారేమో అనుకున్నా" నన్నాడు మోహన్రావు తనలో ఆ ఆలోచన రేపిన జయ వంక కోర చూపు చూస్తూ.

"ఆఁ ఆడముండలేవో గొడవపడుతుంటారు. ఆయన మంచివాడే — మే మిద్దరం బాగానే ఉంటాం. వాళ్లే సర్దుకుంటార్లెండి. ఆ మాత్రానికి ఇల్లు మారాలా?" అని వెళ్లిపోయాడు.

జయ బుర్ర తిరిగిపోయింది. ఆ విషయాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలో కూడా తెలియలేదు.

కానీ సరిగ్గా అట్లాంటి పరిస్థితే ఎదురవుతుందని జయ ఆ క్షణంలో అనుకోలేదు. సరిగ్గా సంవత్సరానికి జయకు అగ్ని పరీక్షరానే వచ్చింది.

ఒకటో క్లాసు నుంచే ఉద్యోగాలు సంపాదించుకునే వరకూ సమానస్థాయిలో ఉన్న చక్రవర్తి, మోహనరావుల మధ్య పెద్ద తేడా వచ్చింది. చక్రవర్తి ఆఫీస్ మేనేజర్ అయ్యాడు. మోహనరావుకి ఇక ఆ అవకాశమే లేదు. ఇక ఎప్పటికీ చక్రవర్తి మేనేజర్. మోహనరావు సూపర్‌వైజర్.

ఈ తేడా ఇద్దరి మగవాళ్ల మధ్యా చాలా ఎడాన్ని తెచ్చింది.

చక్రవర్తికి ప్రమోషన్ ఇచ్చారనగానే ఆనందంతో కావలించుకోవాల్సిన మోహనరావు కరచాలనం చేసి వెళ్లిపోయాడు.

చక్రవర్తి ఇంట్లో జరిగిన పార్టీలో జోకులన్నీ చక్రవర్తే వేశాడు. మాలతి, జయలు పార్టీ హడావుడిలో వీళ్లిద్దరినీ పట్టించుకోనేలేదు. దాదాపు వంటలన్నీ జయే దగ్గరుండి జాగ్రత్తగా చేసింది.

మాలతీ వచ్చిన వాళ్లను ఆహ్వానించే పని చూసుకుంటే, జయ గిన్నెలు, ప్లేట్లు సర్దించి భోజనాల పని చూసుకుంది.

ఆ రాత్రి మోహనరావు —

"ఏమ్మి నువ్వేమనుకుంటున్నావు? ఆ మాలతి దగ్గర నౌకరువనుకుంటున్నావా?" అనడిగితే జయకు అర్థం కాలేదు. అయోమయంగా చూసింది.

బహుశా జయ వేరే బెంచీలో కూచున్నప్పుడు మరియమ్మ చూసిన చూపదే కావచ్చు.

"అదేంటి అలా అంటావు?"

"మరి — ఆవిడ చక్కగా అలంకరించుకుని గేటు దగ్గర నించుంటే నువ్వు వంటింట్లో చెమటలు కక్కుతున్నా వెందుకు?

"నే నెటూ ఆఫీసులో వాడి కిందవాడినే. నువ్వన్నా కాస్త డిగ్నిటీ మెయిన్‌టెయిన్ చెయ్యి."

ఈ మాటల్నీ, ఈ మాటల వెనక ఉన్న అర్థాన్నీ మోహనరావులో వచ్చిన మార్పునీ గమనించిన జయ వణికిపోయింది. మాలతి — మాలతి కూడా తనకు దూరమవుతుందా? జయ అనుమానం రోజు రోజుకీ బలపడుతూందేగాని తగ్గటం లేదు.

మోహనరావు చక్రవర్తి ఇంటికి వెళ్లటం తగ్గించాడు. వాళ్లొచ్చినా మౌనంగా ఉంటున్నాడు. మాలతి తెలివైంది గాబట్టి వెంటనే అర్థం చేసుకుంది.

"మా ఆయనకు మేనేజర్‌గా ప్రమోషన్ రాకున్నా బాగుండేది" అంది.

ఆమె కళ్లల్లో బాధ చూసి జయకు మోహన్రావు మీద కోపం వచ్చింది.

"ఒక్క మెట్టు పైకెక్కిన స్నేహితుడిని చూసి ఓర్చుకోలేకపోతే — అట్లాంటి స్నేహితుడి కోసం ప్రమోషన్ వదులుకోవటం ఎందుకు? ఆ స్నేహానికి అంత అర్హత ఉందా?"

తన భర్తకు వ్యతిరేకంగా, ఒక మనిషిగా మాట్లాడిన జయను గౌరవంగా ప్రేమగా చూసింది మాలతి.

"వాళ్ల గొడవలు మన మధ్యకు రానివ్వకుండా మన స్నేహాన్ని బతికించుకోగలమా?" ఎప్పుడూ ధైర్యంగా గలగల నవ్వుతూ ఉండే మాలతి గొంతులో దైన్యం!

జయకు గత అనుభవాలన్నీ ఉప్పెనలా వచ్చి మీద పడ్డాయి. ఆమె మన సో వాయుగుండమయింది.

"బతకదు మాలతీ — మన స్నేహం బతకదు — బతకనివ్వరు. మా నాన్న, అమ్మ, అన్న అందరూ నా స్నేహాన్ని అణిచేశారు. చంపేశారు. ఇప్పుడీయన కూడో అంతకంటే తక్కువ అనిపించటం లేదు. నాకు చాలా భయంగా ఉంది" జయ ఏడుస్తుంటే మాలతి ఓదార్చి పాట పాడింది.

"దోస్త్ దోస్త్ నా రహా — ప్యార్ ప్యార్ నా రహా"

ఎందుకు ఎందుకు ఉండరు?

స్నేహితుల మధ్య అభిప్రాయభేదాలొస్తే అది వేరే సంగతి. కానీ అసలు మన స్నేహాల మీద వీళ్ల పెత్తనాలేమిటి? ఆ పెత్తనాలకు మనం లొంగట మేమిటి? ఎందుకు లొంగాలి? జయ ప్రశ్నలు మాలతి మనసులో మరిన్ని ఆలోచనలు రేపాయి.

రోజులు గడుస్తున్న కొద్దీ మోహనరావు ఆఫీసులో అశాంతులన్నీ ఇంటికి మోసుకురావటం ఎక్కువయింది. అతను చక్రవర్తిని తిడుతుంటే విని భరించలేకపోతోంది జయ.

అవన్నీ విని మళ్లీ మాలతి ముఖం చూడలేకపోతోంది. భర్త ఆఫీసుకు వెళ్లగానే ఇద్దరూ ఒక ఇంట్లో చేరలేకపోతున్నారు. మోహన్రావు వేరే ఉద్యోగాల కోసం అప్లికేషన్లు పెడుతున్నాడు.

"వాడి కంటే రెండొందలన్నా ఎక్కువ జీతం తెచ్చుకుంటేగాని నాకు మనశ్శాంతి ఉండదు" అనేశాడు.

భర్త వికృత రూపాలు భార్యకంటే ఎక్కువగా ఎవరికి కనిపిస్తాయి? జయకు మోహనరావు ముఖంలో అందం కనిపించటం మానేసింది.

చివరికి వైజాగ్‌లో ఉద్యోగం దొరికింది.

"పీడ వదిలింది. బుద్ధి తెలిసిన నాటి నుంచీ వీడి పీడే నాకు. ఎందులోనూ ఎక్కిరాకుండా చూశాడు. వాడి గ్రహణం వదిలిందిగదా ఇక చూడు నే నెట్లా పైకి పోతానో" ఇన్నాళ్ల స్నేహాన్ని మోహన్రావు వికృతపరచిన తీరుకి జయ నివ్వెరపోయింది. నిజంగా ఇన్నాళ్ల నుంచీ మనసు లోపలి పొరల్లో చక్రవర్తి స్నేహం గురించి ఇతనికిదే అభిప్రాయం ఉందా? ఉంటే అదెంత ఘోరం — ఉండకపోతే అంత స్నేహాన్ని ఇలా మలినపర్చగలిగే మొరటుతనం ఇతని కెక్కడినుంచి వచ్చింది?

దేనికి? డబ్బుకా, అధికారానికా, స్నేహాన్నింత హీనపర్చగలిగిన శక్తి ఉంది! అసూయా?

"ఇక లేచి కారు ఎక్కు. సామాన్ల లారీ బయల్దేరుతోంది" మోహన్రావు జయను కుదిపి ఆలోచనల్లోంచి బైటపడేశాడు. చివరిగా మాలతికి చెప్పి రావాలి. అది చాలా బాధాకరమైన పనే అయినా తప్పదు. జయ మాలతి దగ్గరకు వెళ్లేసరికి మాలతి ఏడుస్తోంది.

జయను చూడగానే లేచి వచ్చి కావలించుకుంది.

"నాకు ఇదే మంచిదనిపిస్తోంది మాలతీ! రోజూ దగ్గరుండి ఒకర్నొకరు చూసుకుంటూ మరింత అసూయలూ, అహంకారాలు పెంచుకుంటున్నారు. దూరంగా ఉంటే మళ్లీ కాస్త కుదుటపడి మారతారేమో" అంది జయ.

"కానీ వాళ్ల వల్ల మనం ఎందుకు దూరమవ్వాలి? నువ్వూ, నేనూ వీళ్లని వదిలి ఉద్యోగాలు వెతుక్కుని మనం స్నేహంగా బతకలేమా?" మాలతి కోపం చూసి జయ జాలిగా నవ్వింది.

"ఎందుకు నవ్వుతావు? స్నేహం కోసం ఎంతమంది మగవాళ్లు ఎన్ని త్యాగాలు చేశారు, వాళ్ల భార్యలతో సహా. అవన్నీ ఎంతెంత గొప్ప గాథలై మనచేత కన్నీళ్లు కార్పించాయి. మనం మన స్నేహం కోసం ఈ భర్తల్ని వదిలేద్దాం. ఎందుకు వదిలెయ్యకూడదు?" మాలతి కోపం కట్టలు తెంచుకుంటోంది.

"అప్పు డది త్యాగం అవదు మాలతీ — ఒళ్లు కొవ్వెక్కటం అవుతుంది. మనకి ఆ గౌరవం దక్కదు. మన గురించి ఎవరూ కథలూ, గాథలూ రాయరు. రాసినా తిడుతూ రాస్తారు. ఆ భర్తల్ని మార్చుకోలేరా అంటారు. ఆ మార్చుకునే భారం మొత్తం మన మీదే వేస్తారు. ఆ భర్తల మాట ప్రకారం నడుచుకోక ఏం తీపరం అంటారు. ఒకవేళ మన గురించి ఎవరైనా కథ రాస్తే ఏం రాస్తారో తెలుసా?

"మనం భర్తల్ని వదిలి — చిన్న ఉద్యోగాలు చేస్తూ ఎన్నో బాధలు పడి, ఎవరి అండా లేక దిక్కు లేని వాళ్లమై, ముసలితనంలో ఒంటరిగా చావు కోసం ఎదురుచూసే దృశ్యాన్ని రచయితలు హృదయాల్ని కరిగించేలా రాస్తారు.

"స్నేహం కోసం భర్తను వదిలేస్తే భద్రత మాటేమిటని నిలదీసి మన జీవితాన్ని చూసి మిగిలిన వాళ్లని బుద్ధి తెచ్చుకోమంటారు.

"ఆడవాళ్లకు స్నేహం చేసే అవకాశం లేదు మాలతీ!

"స్నేహం చెయ్యాలన్నా, మానాలన్నా, మనుషులకు దగ్గరవ్వాలన్నా, దూరమవ్వాలన్నా, స్వేచ్ఛ కావాలి మనకు. స్త్రీలకు ఆ స్వేచ్ఛ లేదు. మనకు స్నేహం ఎట్లా దొరుకుతుంది! ఈ మొగుడు కాకుంటే మరింకో మొగుడెవరో వస్తాడు, మన స్నేహానికి అంకెలు పెట్టటానికి!"

జయ ఆవేశంగా మాట్లాడుతుంటే మాలతి జయవంక కొత్తగా చూస్తోంది.

జయ ఇక ఏం చెయ్యాలో తెలియని దానిలా, మళ్లీ మాలతి కనిపించదు అనే ఊహతో మాలతిని కళ్లలో నింపుకోవాలన్నట్టు చూస్తోంది.

చూసీ, చూసీ వెనక్కు తిరిగి తన ఇంటి ముందు సామాన్లు నిండిన లారీ వెనకగా ఆగి ఉన్న కారు ఎక్కి కూచుంది. స్నేహాన్ని వెనక వదిలి కారు ముందుకు వెళ్లిపోయింది.

●